## మైలార్‌దేవ్‌పల్లి పీహెచ్‌సీలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**దశ, రంగారెడ్డి:** మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణకుమారి ఆమె వెంట ఉన్నారు. పీహెచ్‌సీలో వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగుల నమోదు, మందుల లభ్యత, ల్యాబొరేటరీ సేవలు, పారిశుద్ధ్యం, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు, ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా చూడాలని ఆదేశించారు. రోగులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. పారిశుద్ధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, మందుల నిల్వపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

## సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం



**దశ, రంగారెడ్డి:** సామాజిక సమానత్వం, బడుగు-బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా పాపన్న చేసిన పోరాటాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



**దశ, చౌటుప్పల్:** చౌటుప్పల్ పురపాలక సంఘం కార్యాలయంలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ బహుజనుల హక్కుల కోసం పోరాడిన యోధుడని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం "సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు జోహార్.. జోహార్" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజయ్య, కౌన్సిలర్లు కొసనం రాకేష్‌రెడ్డి, పూదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, బద్రి గాలయ్య, పాక చిరంజీవి, చింతల ఉమామహేశ్వరి సాయిలు, పిల్లలమర్రి మధుసూదన్, కో ఆప్షన్ సభ్యుడు పస్తం గంగారాములు, నాయకులు ఉడుగు రమేష్, బత్తుల దాసు, షేక్ జానీబాబా, పల్లె సురేందర్‌రెడ్డి, గౌడ సంఘాల ప్రముఖులు, యువజన నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మునిపంపుల దళిత కాలనీలో రాచకాల్వ సమస్య పరిష్కరించాలి



❖ 'ఇండ్ల మధ్య మురికి నీరు.. విషసర్పాల సంచారం.

**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలోని దళిత కాలనీలో రాచకాల్వ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి, గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్ చేశారు. సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో కాలనీని పరిశీలించిన ఆయన.. ఇండ్ల మధ్య నుంచి మురికి నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాల్వలో మురికి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లడంతో పాటు విషసర్పాలు, ఇతర విషపురుగులు ఇండ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మురికి నీరు, దోమల కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కాలనీ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి రాచకాల్వకు శాశ్వత పరిష్కారం చూపాలని వెంకటేశం కోరారు. కాల్వకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని, మురికి నీరు సక్రమంగా ప్రవహించేలా స్లాబ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకుని దుర్గంధం, దోమలు, విషసర్పాల బెడద నుంచి కాలనీ ప్రజలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు తొలుపునూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, వార్డు సభ్యులు గంటెపాక శ్రీను, బూడిద నర్సింహ, నాయకులు తొలుపునూరి చంద్రశేఖర్, బూడిద బిక్షం, ఉంద్రాతి నర్సింహ, ఎండీ మైనొద్దీన్, జోగుల శ్రీనివాస్, గునుగుంట్ల సత్యనారాయణ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## బడుగుల రాజ్యాధికారం దిశగా పయనించాలి

❖ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..

**దశ, ఓయూ:** బడుగుల రాజ్యాధికారం దిశగా బీసీలు పయనించాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. మంగళవారం చిలకనగర్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి ఉత్సవాలు గజ్జల సత్సంగం అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జాజుల శ్రీనివాస్ గౌడ్, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వరం, అనంతోజు బ్రహ్మాచారి, భాస్కర్ గౌడ్ అండి గారి రాజు శ్రీనివాస్ గౌడ్ తో కలిసి గణేష్ చారి హాజరై పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగులకు జరుగుతున్న అన్యాయంపై ఎదిరించి పోరాటం చేసిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనంత బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.





## సర్వాయి పాపన్న స్ఫూర్తితో కష్టజీవుల రాజ్యం కోసం పోరాడాలి

**దశ, రామన్నపేట:** సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో కష్టజీవుల రాజ్యం కోసం పోరాటం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి బావుండ్లపల్లి బాలరాజు పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న 376వ జయంతి సందర్భంగా రామన్నపేట సుభాష్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం పదేళ్లుగా చేసిన పోరాటం ఫలించిందని, విగ్రహాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కల్లుగీత కార్మికుల పెండింగ్ ఎక్స్‌గ్రేషియా సమస్యలను పరిష్కరించాలని, సహకార సంఘాలకు రూ.6 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, అర్హులైన కల్లుగీత కార్మికులందరికీ మోటార్ బైక్‌లు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో కేజీకేఎస్ మండల అధ్యక్షుడు కునూరు మల్లేశం, కోశాధికారి మునుకుంట్ల లెనిన్, కునూరు శ్రీనివాస్, కొండ మల్లేశం, కంభంపాటి శ్రీనివాస్, బాలగోని నరసింహ, గంగపురం యాదయ్య, బోయపల్లి రామలింగయ్య, ఎర్ర మహాలింగం, చెరుకు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్ బహూకరణ



**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు మాజీ ఎంపీటీసీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్‌ను బహూకరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశాల మేరకు ఈ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇడెం రాధ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పాత గదుల స్థానంలో కొత్త గదులను ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేయించాలని కోరారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో శిథిలావస్థలో ఉన్న గదుల స్థానంలో రెండు అదనపు గదులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎపీసీ చైర్మన్ పులగం సులోచన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి, ఉయ్యాల బిక్షమయ్య, మందుగుల వెంకటయ్య, ఇడెం స్వరూప సేవా ట్రస్ట్ చైర్మన్ ఇడెం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిటిపాముల పెద్దులు, నాయకులు గంజి నర్సింహ, భాస్కర్, చక్రపాణి, గోషిక కొండల్‌రెడ్డి, కనుత్తాల భాస్కర్‌రెడ్డి, ఎడ్ల సంజీవరెడ్డి, రుద్ర వెంకటేష్, మిరియాల నరేశ్, మిరియాల వెంకటేష్, గోధుమల సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

❖ 'మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి చిట్యాల రవిచంద్ర డిమాండ్




**దశ సూర్యాపేట ప్రతినిధి :** గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల రవిచంద్ర డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మోతె మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం రిలే దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ మండల అధ్యక్షులు నావిలే నాగరాజు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా చిట్యాల రవిచంద్ర మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు రూ.26,000 కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఆ వేతనాన్ని నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెండో పీఆర్సీలోకి తీసుకురావాలని, ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామపంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని, దానకర్చులకు రూ.30,000 వేతనం చెల్లించాలని కోరారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల మెడకు ఉరితాడుగా మారిన మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు వట్టికూటి అవిలయ్య, ప్రధాన కార్యదర్శి గజ్జి లింగయ్య, జలగం తిరపయ్య, వీరయ్య, వీరారెడ్డి, నాగమణితో పాటు వివిధ గ్రామపంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా పోలీసు శాఖకు అందుబాటులో మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్

❖ ప్రారంభించిన ఎస్పీ నరసింహ ఐపీఎస్

**దశ సూర్యాపేట ప్రతినిధి :** సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేసేందుకు సూర్యాపేట జిల్లా పోలీసు శాఖకు మరో అత్యాధునిక సాంకేతిక వాహనం (మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్) అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర పోలీసు శాఖ కేటాయించిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పోలీసు అధికారులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేర పరిశోధనలో ఫోరెన్సిక్ ఆధారం అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఈ మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ ద్వారా సంఘటనా స్థలం నుండే నేరుగా ఫోరెన్సిక్ ఆధారాలను వేగంగా సేకరించవచ్చని తెలిపారు. సాంకేతిక పద్ధతులను ఉపయోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం ద్వారా నిందితులను త్వరగా గుర్తించవచ్చని, వారు చట్టం నుండి తప్పించుకోకుండా కఠిన శిక్షలు పడేలా చేయవచ్చని ఎస్పీ గారు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బీ డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, రాజశేఖర్, సాయిరాం మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా హనుమాన్ నగర్ అమ్మవారి మహా ఊరేగింపు





❖ భక్తిశ్రద్ధలతో మార్మోగిన హనుమాన్ నగర్..

❖ శ్రీరామ్ వెంకట్‌కు ఘన సన్మానం

**దశ ఓయూ:** బోనాల వేడుకలను పురస్కరించుకుని తార్నాక హనుమాన్ నగర్‌లో నిర్వహించిన అమ్మవారి మహా ఊరేగింపు భక్తిశ్రద్ధలు, సంప్రదాయ వైభవంతో అంగరంగ వైభవంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో హనుమాన్ నగర్ ప్రాంతం భక్తి, ఉత్సాహంతో మార్మోగింది. బ్యాండ్ మేళాలు, బాణసంచా, భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవారి ఊరేగింపు ఘనంగా సాగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భారత్ గౌడ్, బీజేపీ నాయకులు, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ శ్రీరామ్ వెంకట్ హాజరయ్యారు. సీనియర్ బీజేపీ నాయకులు, యువతతో పాటు హనుమాన్ నగర్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**శ్రీరామ్ వెంకట్‌కు ఘన సన్మానం**

అమ్మవారి మహా ఊరేగింపు విజయవంతం కావడానికి సహకరించిన డాక్టర్ శ్రీరామ్ వెంకట్‌ను హనుమాన్ నగర్ ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ఆయన అందించిన సహకారాన్ని ప్రశంసించారు. సందర్భంగా శ్రీరామ్ వెంకట్ మాట్లాడుతూ, హనుమాన్ నగర్ ప్రజల ఆనందంలో భాగస్వామి కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలు స్వయంగా వచ్చి అభినందించి సన్మానించడం మరువలేని అనుభూతి అని పేర్కొన్నారు.

ఈ గౌరవం తన ఒక్కరిదే కాదని, కార్యక్రమం కోసం కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరిదని అన్నారు. తార్నాకలో ప్రతి పండుగ ప్రజలందరినీ కలిపే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. కాలనీలు వేరైనా ప్రజల మనసులు ఒక్కటేనని, ఐక్యత, పరస్పర సహకారం తార్నాక అభివృద్ధికి మరింత బలాన్ని ఇస్తాయని తెలిపారు.

మ్మవారి ఆశీస్సులతో హనుమాన్ నగర్, తార్నాక ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని డాక్టర్ శ్రీరామ్ వెంకట్ ఆకాంక్షించారు.

# స్టైఫండ్ పెంపుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలి

❖ 15వ రోజుకు చేరుకున్న ఆయుష్ నిరవధిక సమ్మె




**దశ, ఓయూ:** తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్లు, విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. రామంతపూర్ లోని జె ఎస్ పి ఎస్ ఆయుష్ మెడికల్ కాలేజ్ వద్ద జరిగిన నిరసన దీక్షలో డాక్టర్లు శ్రేయ రాయ్, వినయ్, మహేశ్వరి, భావన, రిషిక మాట్లాడుతూ దాదాపు పది సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న స్టైఫండ్ ను పెంచాలని అనేక మార్లు మంత్రులు అధికారులను కలిసిన న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాలలో జరుగుతున్న నిరసనలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం స్టైఫండ్ పెంపుపై తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సేవ చేస్తున్న ఆయుష్ వైద్యుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. తమ సేవలకు తగిన గౌరవం సమానత్వం న్యాయం దక్కాలని 15 రోజులుగా పోరాటం చేస్తున్నామని వెంటనే పెంపుపై జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# బెల్లంపల్లిలో రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



**దశ, బెల్లంపల్లి:** పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సింగరేణి సంస్థకు చెందిన విద్యుత్ స్తంభాల తరలింపు (షిఫ్టింగ్) పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న రోడ్డు విస్తరణకు సహకరిస్తున్న సింగరేణి యాజమాన్యానికి, ముఖ్యంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు విస్తరణ పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో కౌన్సిలర్ మత్తమారి రాయమల్లు, నాయకులు దావ రమేష్, మునిమంద రమేష్, కంకటి శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, పీక లక్ష్మణ్, రియాజ్‌తో పాటు మున్సిపల్, సింగరేణి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని వినతి



**దశ, రుద్రంగి:** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచుతూ మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా మానాల గ్రామంలోని జడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో 240 మంది నూతన విద్యార్థులను చేర్పించామని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని గ్రామస్తులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు. గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉపసర్పంచ్ దాసరి అశోక్, యువకులు, గ్రామ ప్రజలు సమష్టిగా కృషి చేసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్య, వసతులపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులను చేర్పించారని తెలిపారు. దీంతో పాఠశాలలో 200 శాతం అడ్మిషన్లు నమోదయ్యాయని, ఈ సందర్భంగా ఆగస్టు 15న కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా ప్రత్యేక ప్రశంసా పత్రం అందుకున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో వారికి నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను వెంటనే కేటాయించాలని కోరారు. అలాగే మానాల జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న నవీన్ సార్‌ను పాఠశాలలోనే కొనసాగించేలా డిప్యూటేషన్‌కు అనుమతించాలని కోరారు.



# సర్పంచుల సంఘం జాయింట్ సెక్రెటరీగా బుర్స

❖ రాజంపేట సర్పంచ్‌కు కీలక బాధ్యతలు

❖ గ్రామీణ సమస్యలపై గళం వినిపించే అవకాశం

**దశ, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ మండలం రాజంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ బుర్స పోశయ్యకు రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు దక్కాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం విస్తృతస్థాయి సమావేశంలో ఆయనను రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ సెక్రెటరీగా నియమించారు. రాష్ట్ర సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు భూమన్న యాదవ్ చేతుల మీదుగా బుర్స పోశయ్య నియామక పత్రాన్ని అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన రాష్ట్ర సంఘం ఈ బాధ్యతలను అప్పగించినట్లు నాయకులు తెలిపారు. రాష్ట్రస్థాయిలో సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, గ్రామపంచాయతీలకు నిధులు, విధులు, అధికారాల సాధన కోసం ఉద్యమించడం, గ్రామీణాభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్రను మరింత బలోపేతం చేయడంలో జాయింట్ సెక్రెటరీగా బుర్స పోశయ్య కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. రాజంపేట గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పనిచేస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసిన పోశయ్యకు రాష్ట్ర సర్పంచుల సంఘంలో కీలక పదవి లభించడంపై జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నియామకం ఆసిఫాబాద్ జిల్లాకు, ముఖ్యంగా రాజంపేట గ్రామపంచాయతీకి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ సెక్రెటరీగా బాధ్యతలు చేపట్టిన బుర్స పోశయ్యకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, నాయకులు, అభిమానులు హార్దిక హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# సీజ్ చేసినా మారని తీరు ఆగని నిర్మాణాలు





**దశ, ఓయూ:** తార్నాక ప్రాంతంలో అక్రమ కట్టడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయనీ స్థానికుడు, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ మన్నన్ ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం తార్నాక సర్కిల్ డిప్యూటీ కమీషనర్ను కలిసి తార్నాక గోఖుల్ నగర్లో సెట్ బ్యాక్ లేకుండా కొనసాగుతున్న ఆక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఓ కొందరు భవన నిర్మాణ దారులు వారు చేపడుతున్న నిర్మాణాలు ఆక్రమం అంటూ గతంలోనే జీహెచ్ఎంసీ టౌన్ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అనుమతి లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను సీజ్ చేయడంతో పాటు కూల్చి వేశారని తెలిపారు. అయినా సదరు వ్యక్తుల తీరు మారలేదు. సీజ్ చేసిన, కూల్చి వేసిన వాటిని తిరిగి యదేచ్చగా నిర్మాణం పూర్తి చేస్తున్నారనీ తెలిపారు.

దీంతో పాటుగా పుట్పాత్ను పూర్తిగా ఆక్రమించి ర్యాంప్, మెట్లు నిర్మాణం చేస్తూ పాదచారులకు ఇబ్బంది కల్గిస్తున్న విషయాన్ని డీసికి వివరించారు. దీనిపై వెంటనే స్పందించి తార్నాకో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలనీ కోరారు. పుట్పాత్పై చేపట్టిన ర్యాంప్, మెట్లను కూల్చివేయాలనీ కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన డీసి రెండు మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామనీ స్పష్టం చేసినట్లు అబ్దుల్ మన్నన్ పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు స్థానికంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

❖ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, డిమాండ్

**దశ, ములకలపల్లి:** ములకలపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారిని పర్మినెంట్ చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని కాపాడుతూ, ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్మికులు నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. అయితే వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడంతో పాటు రెండో పీఆర్సీలో చేర్చి, వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వర్క్ రుగ్మదరావు, మేకల రమేష్, బొమ్మగాని శంకర్, జి. శంకర్, కుంజా శ్రీను, సాయి రత్నం, కుంజా రాజు, కారం రాజ్‌కుమార్, చాప వెంకటేష్, నరేష్, యేసుబాబు, కుంజా రవి, వగెల శ్రీను, గడ్డం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

❖ ముదిరాజ్ సంఘం వినతి



**దశ, కామారెడ్డి:** రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న విగ్రహాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ ముదిరాజ్ సంఘం నాయకులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అదనపు కలెక్టర్ గిరికి వినతిపత్రం అందజేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన పండుగ సాయన్న చరిత్రను, ఆయన పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని నాయకులు తెలిపారు. నిజాం పాలన కాలంలో భూస్వాములు, పెత్తందారుల ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో అణగారిన వర్గాల కోసం పండుగ సాయన్న పోరాడారని వారు పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా పేద కుటుంబాలకు అండగా నిలిచారని, ఆడపిల్లల వివాహాలకు సహాయం చేస్తూ పేద ప్రజలకు పెద్దన్నగా నిలిచారని కొనియాడారు. కేవలం 36 ఏళ్ల వయసులోనే బహుజన రాజ్యాధికారం కోసం పండుగ సాయన్న పోరాటం సాగించారని తెలిపారు. ఆయన ఆశయాలు, సేవలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు తెలియాలంటే కామారెడ్డి జిల్లా కేంద్రంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో, ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో గణనీయమైన జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గం ఆత్మగౌరవానికి పండుగ సాయన్న విగ్రహం ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, పున్న రాజేశ్వర్, బర్ల స్వామి, కనికంటి రమేష్, చిట్యాల రమేష్, పిట్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపనకు కృషి చేయాలి

❖ ఘనంగా తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు.



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట తొలి తెలుగు దళిత బహుజన విప్లవ వీరుడు మూడు శతాబ్దాల క్రితమే భూస్వాములు, నిజాం, మొగలాయిలకు వ్యతిరేకంగా పోరాడి 12 వేల సైన్యంతో అనేక కోటలు నేర్పించిన గొప్ప పోరాట ధైర్య శీలి, రాజనీతి దురంధరుడు, శ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపనకు కృషి చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వై, వెంకటేశ్వర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా పిలుపునిచ్చారు. సూర్యాపేట పౌర సమాజం భాగస్వామ్యంతో ఇదే కోర్టు చౌరస్తా వద్ద పాపన్న విగ్రహం ఏర్పాటుకు వచ్చే జయంతి నాటికి ఏర్పాటు చేసేందుకు పార్టీలకతీతంగా కులాలకు సంఘాల కచ్చితంగా ఏర్పాటు చేయాలని తీర్మానం చేయడం అభినందనీయం అన్నారు. ఐక్యమత్యంతో బడుగు, బలహీన అణగారిన వర్గాలు చైతన్యంతో ముందుకెళ్ళి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ షఫీ ఉల్లా మాట్లాడుతూ పాపన్న వంటి మహనీయుల విగ్రహం ఏర్పాటుకు మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. మూడున్నర శతాబ్దాల క్రితమే అనిచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చిన పాపన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు చిత్రపటాలను పెట్టి కార్యక్రమాలు చేసుకునే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గౌడ కులంలో జన్మించినప్పటికీ గౌడ కులానికి పరిమితం కాకుండా అనేక సబ్బండ వర్గాలను కలుపుకొని అనేక కోటలను నిర్మించి ఆధిపత్యం, అసమానతలు, అణిచివేతకు, వ్యతిరేకంగా పోరాడాలని బహుజన కులాల్లో ధైర్యం నింపిన గొప్ప మహనీయుడని కొనియాడారు. జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఉద్యమ నాయకులు కుంట్ల ధర్మార్జున్, ఆర్యవైశ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారు రాజా, జిల్లా కాంగ్రెస్ నాయకుడు బైరు వెంకన్న గౌడ్ లు మాట్లాడుతూ పాపన్న విగ్రహం ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.